కథా కౌముది



# ముగ్గురు నేరస్తులు

బి.నర్సన్

పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
కౌముది నిర్వహించిన కథల పోటీ (2021)లో
సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ

సురేష్ ఓ వింత కేసులో విచిత్రంగా ఇరుక్కున్నాడు. ఇవ్వాళ్ల కోర్టులో దాని హియరింగ్ ఉంది. ఎప్పుడైనా పిలువవచ్చు అని అడ్వొకేట్ చెప్పడంతో పదింటికే వచ్చి అడ్వొకేటుకు ముఖం చూయించి కోర్టు ఆవరణలో ఉన్న పెద్ద చెట్టు చుట్టూ కట్టిన సిమెంట్ గద్దెపై కూచున్నాడు. తన లాగే వచ్చిన మరో కోర్టు పక్షి కొద్ది దూరంలో పక్కన కూచున్నాడు.

కోర్టు కొనసాగుతోంది.

వచ్చే పోయేవాళ్ల హడావుడి స్పీడ్ మోషన్ లో కదులుతున్న సురేష్ ముఖంలో కమ్ముకున్న విసుగు మాత్రం కదలనంటోంది. జేబులోంచి మొబైల్ తీసుకొని టైం చూశాడు. పన్నెండవుతోంది. ఎందుకో గాని కొన్ని చోట్ల గడియారానికి ఒళ్ళు వంగదు. మొబైల్ ను తిరిగి పాకెట్లో వేసుకొని పక్కాయన వైపు చూశాడు. ఆయన నొసలుపై చేతివేళ్ళతో రుద్దుకుంటూ ఔటాఫ్ మూడ్ లో ఉన్నట్టున్నాడు. కోర్టు ఆవరణలో ఇలా కాక మరెలా ఉంటారనుకొంటూ ఆయనను పలకరించాడు.

'కేసుందా సార్'

భారంగా తల ఎత్తి సురేష్ వైపు చూస్తూ ఔనన్నట్లు తలూపాడు.

'ఏం చేస్తుంటారు..?'

'హోమ్ గార్డును'

'అరె.. పోలీస్ డిపార్టుమెంటా ..మీపై కేసేముంటుంది.. లాకప్ డెతా..?'

'ఛీ.. కాదు సార్.. కుక్కను చంపాను..'

' ఏమిటి..? ఇవ్వాళ్ళ అన్నీ జంతువుల కేసులేనా..?' అన్నాడు చిత్రంగా సురేష్.

కాలానికి కొంత హుషారు తోడయ్యింది.

'అసలు విషయమేంటో క్లియర్ గా చెప్పండి' అంటూ సురేష్ ఆయన దగ్గరగా జరిగాడు.

' నేను హోమ్ గార్డ్ గా చేయబట్టి ఐదేళ్లు అయింది కాని కుక్కను చంపితే ఇంత పెద్ద కథ అవుతాదని తెలియనే తెలియదు. ఉద్యోగంలోంచి తీసేశారు సార్..' అన్నాడు దీనంగా.

' అయ్యో.. ఎవరిదైనా పెంపుడు కుక్కనా..?'

' కాదు సార్ .. ఊరకుక్క' దానికి కూడా అంత విలువనా అన్నట్లు చేయి ఊపుతూ చెప్పాడు.

'ఔనా.' అంటూ ఎంత కష్టమొచ్చె నీకు అన్నట్లు చూశాడు సురేష్ ఆయన్ని.

'దేన్నీ చంపినా నేరమేనట' అని ఎవరో చెప్పింది విని చెప్పాడాయన.

ఇంత చదువు చదివిన తనకే కేసు మీద పడే దాకా తెలియలేదు. ఈ చిరుప్రాణికి ఎలా తెలుస్తుంది అనుకుంటూ 'అసలు ఎందుకు చంపావు?' అని ఆయన ముఖంలోకి చూశాడు.

'సార్.. అది దొంగ కుక్క .. మాది జగద్గిరిగుట్టలో చిన్న కిరాయి ఇల్లు.. దాని తలుపుకు సందుంటుంది. ఎన్ని అట్టపెట్టెలు కట్టినా అది తోసుకొని పోతోంది. ఓనర్ కు చెబితే ఇప్పుడు అప్పుడు అంటూ దాటేస్తున్నాడు. ఇల్లు మారుదామంటే రెంట్స్ ఎక్కువగా ఉన్నాయి. నా భార్య స్కూల్లో ఆయాగా చేస్తుంది. వంట చేసి డ్యూటీకి వెళ్తుంది. నేను భోజనానికి వెళ్లే ముందే ఆ కుక్క లోపలి వెళ్లి గిన్నెలు ఖాళీ చేస్తోంది. అలసి పోయి ఆకలితో ఇంటికొస్తే ఖాళీ గిన్నెలు అగుపడితే ఎంత బేజారైపోతాం సార్. ఓ రోజు నేను వచ్చే ముందే అది లోనకు వెళ్ళిందేమో.. తలుపు దగ్గరికి వెళ్ళగానే గిన్నెలు చప్పుడు వినిపిస్తోంది. కడుపుమంటతో కోపం నషాళానికి చేరింది కాని చంపాలనుకోలేదు. తలుపు తీయడంతోనే నా కాళ్ళసందులోంచి జారుకుని రోడ్డెక్కింది. తప్పించుకుందే అన్న కోపంతో చేతిలో ఉన్న తాళం కప్పను దానివైపు విసిరాను. సరిగ్గా రాయితో కొట్టినట్లు తాళం దాని తలకు తాకింది. దెబ్బకు కుక్క గుండ్రంగా తిరిగి కింద పడిపోయి కాళ్ళు చాపేసింది. దగ్గరికెళ్లి చూస్తే దాని ఊపిరి ఆడటం లేదు. తాళం తీసుకొని ఇంటికొచ్చాను. నాల్రోజులు బాగానే గడిచాయి. అయితే ఎవరు ఆ కుక్కను ఫోటో తీసి పేపర్ వాళ్లకు ఇచ్చారోగాని నా గతి ఇట్లా మారిపోయింది. నేను కుక్కను చంపాను. పాపినే. మరి అది రోజు నా అన్నం తింటోంది. ఆ బాధ ఎవరికి చెప్పాలి. దానికి శిక్ష ఎవరు వేస్తారు. మనుషుల దొంగతనానికి కోర్టులు చట్టాలున్నాయి. చట్టాన్ని మనము చేతుల్లోకి తీసుకోకూడదు. అన్నీ ఒప్పుకుంటాను. కుక్క, కోతి లాంటి జంతువులు మనుషులకు నష్టం చేస్తే విచారించి వాటికి శిక్షించే కోర్టులు కూడా ఉంటే బాగుండు.

అప్పుడు మనుషులు వాటిని రాళ్లతో, కర్రలతో కొట్టకుండా చక్కగా ఫిర్యాదు చేసేవాళ్ళు కదా.. న్యాయమూర్తిని ఇదే మాట అడుగుతాను' అన్నాడాయన.

సురేష్ కు ఈయన లాజిక్ బాగానే ఉందనిపించింది.

'మీరేం చేశారు సార్?' అన్నాడు మీ కథ చెప్పమన్నట్లు కలుపుగోలుగా.

'నాదీ మరీ దరిద్రమైన కేసు. నా వల్లే ఓ బుజ్జి కుక్క చచ్చింది కాని నీలా కొట్టి చంపలేదు.' అంతా నా తలరాత అన్నట్లుగా ముఖం పెట్టాడు.

ఏమీ అర్థం కానట్లు అయ్యో పాపం అన్నట్లు మిశ్రమ స్పందననిచ్చాడాయన.

దాంతో చూసిన సినిమా కథ చెప్తున్నట్లుగా మొదలుపెట్టాడు సురేష్.

'నేనో సాఫ్ట్ వెర్ ఇంజనీర్ని. నా ఫ్రెండ్ మధు ఒంటిగాడు, వాళ్ళ అక్క బావలతో ఇక్కడే సిటీలో యూసుఫ్ గూడలో ఉంటున్నాడు. అనుకోకుండా వాళ్లిద్దరూ ప్రయాణాలు కట్టవలసి వచ్చింది. వాడి అక్క డెలివరీకి వాళ్ళమ్మ దగ్గరికెళ్లింది. బావనేమో నెల రోజులు ట్రైనింగ్ కోసం లక్నో వెళ్ళాడు. అంతవరకూ బాగానే ఉంది. అయితే సడెన్ గా మధుగాడికి కూడా టూర్ పడింది. రెండు వారాల కోసం వాడు కంపెనీ పని మీద సింగపూర్ వెళ్లక తప్పలేదు. అప్పుడు వాడు నాకు ఫోన్ చేశాడు. ఇదీ పరిస్థితి అన్నాడు. ప్రాబ్లమేముందిరా పోయిరా అన్నాను. అది కాదురా.. మా ఇంట్లో రెండు

చిన్న కుక్కపిల్లలున్నాయి..వాటిని టూ వీక్స్ చూసుకునేవాళ్ళు కావాలి.. అన్నాడు. ఎవరైనా పక్క వాళ్ళకో, తెలిసినవాళ్లకో అప్పగించు.. అన్నాను. ట్రై చేశానురా.. ఎవరు హెల్ప్ చేసేలా లేరు.. అందుకే నిన్నడిగేది.. అన్నాడు. నాకు కుక్కల గురించి ఏం తెలుసురా.. అన్నాన్నేను. నీవు ఎట్లాగూ పేయింగ్ గెస్ట్ హాస్టల్లోనే గదా ఉండేది.. ఈ పదిహేను రోజులు మా ఇంట్లోనే ఉండు. పొద్దున్నేవాటిని బయటికి తీసికెళ్ళి ఆఫీసుకు వెళ్లే ముందు పాలు అన్నం బిస్కెట్లు గిన్నెల్లో ఉంచితే అవే తింటాయి. రాత్రి బుద్ధిగా పడుకొంటాయి. నీకేం కష్టముండదు. ప్లీజ్ రా.. అన్నాడు. నేను సరే అన్నాను. వాడు సింగపూర్ వెళ్ళిపోయాడు. నేను వారి ఇంట్లోనే ఉంటూ పప్పీలను చూసుకుంటున్నాను. నాలుగో రోజు అనుకోకుండా ఓ రోజు సాయంత్రం ఆఫీసునుండి వస్తుండగా నా బైక్ ను వెనుక నుంచి ఓ కారు గుద్దింది. నేను ఎగిరిపడి రోడ్ డివైడర్ పై పడ్డాను. ఆ తాకిడికి హెల్మెట్ బెల్ట్ ఊడిపోయి తలకు గట్టి దెబ్బతగిలింది. ఎవరో హాస్పిటల్లో చేర్చారు. నాలుగో రోజు కళ్ళు తెరిచాను. హాస్పిటల్ లెక్క చూసుకొని బయటికి రాగానే కుక్క పిల్లలు గుర్తుకొచ్చాయి.హైరానాగా సరాసరి మధుగాడి ఇంటికెళ్ళాను. అక్కడంతా జనం గుమిగూడి ఉన్నారు. ఇంటిలోంచి వాసనొస్తే పోలీసులకు ఫోన్ చేశారట. నన్ను చూడగానే తలుపు తెరవమన్నారు. రెండు కుక్కల్లో చిన్నది ఆకలి బాధ తట్టుకోలేక చనిపోయినట్లుంది. కుళ్ళి వాసన వేస్తోంది. ఎంత పని జరిగిందని తల కొట్టుకుంటూ ఏడ్చాను. రెండోది కాస్త తట్టుకున్న నీరసంగా పడి ఉంది. వెంటనే దానికి నీళ్లు తాగించి బిస్కట్టు పెట్టాను. కొద్దిగా తేరుకుంది. పోలీసులు నన్ను స్టేషనుకు తీసికెళ్లారు. నా ఇల్లు కాదన్నాను.

రిక్వెస్ట్ చేస్తే ఉంటున్నానన్నాను. ఓనర్స్ వచ్చేదాకా ఆగమన్నాను. ఏం చెప్పినా ఎంత బతిమిలాడినా వినలేదు. వీధిలో వాళ్లంతా చూశారు కాబట్టి కేసు తప్పదన్నారు.

ఏమన్నా ఉంటే కోర్టులో చెప్పుకోండి.. దోషులెవరో తేలిపోతుంది అన్నారు. అడ్వొకేట్ నడిగితే నీ సంరక్షణ సమయంలోనే చనిపోయింది కాబట్టి కుక్క యజమాని ఎవరైనా తప్పు నీదే అవుతుంది. అయితే నీకు జరిగిన యాక్సిడెంట్ వల్ల ఇలా జరిగిందని రుజువులు చూయిస్తే జడ్జి ఏమైనా శిక్ష తగ్గించవచ్చు అన్నాడు.' అని చెప్పాడు సురేష్ ఆయనకు హాస్పిటల్ ఫైల్ చూయిస్తూ.

వీధి కుక్క బాధితుడిని పేరు పెట్టి పిలవగానే గబా గబా కోర్టు హాలులోకి వెళ్ళాడు.

జడ్జి ఏమడుగుతాడు, ఈయనేం చెబుతాడో చూద్దామని మెల్లగా ఆయన వెనుకాలే వెళ్లి కోర్టు హాలులోకి వెళ్లి చివరి వరుసలో కూచున్నాడు సురేష్.

సురేష్ రాకను గమనించిన జడ్జి అడ్వకేట్ వంక చేశాడు. తర్వాతి కేసు ఆయనదేనని జడ్జికి చెప్పాడు. తన పక్కనున్న సురేష్ కేసు ఫైలును తిరగేసిన జడ్జి ఆయన వంక చూసి నీవేనా అన్నట్లు కళ్ళు పెద్దగా చేశాడు.

కోర్టు హాలులో జనం పలుచగా ఉన్నారు. బహుశా ఇవే చివరి కేసులేమో.

ఇద్దరు ముద్దాయి వంక చూసి నిస్తేజంగా తల దించుకున్నాడు జడ్జి.

ఆయన మనసు బాగా లేదు.

పెద్ద కేసులనన్నింటిని వాయిదాలు వేసి వీరి కేసులను ముందేసుకున్నాడు.

జడ్జికి ఇవ్వాళ్ల తన ఇంట్లో అనుకోకుండా జరిగిన సంఘటన పదే పదే గుర్తుకొస్తూ తొలిచివేస్తోంది.

పొద్దుటే టిఫిన్ చేస్తుండగా డైనింగ్ టేబుల్ కింద కాళ్ళ మధ్య ఏదో కదలడంతో ఏమరపాటున కాలు విదిలించాడు. ఆ దెబ్బకు అక్కడ తచ్చాడుతున్న చిన్నపిల్లి పిల్ల ఎగిరి వేడి నీళ్ల బకెట్ లో పడింది. బాత్ రూమ్ లో గీజర్ ఆ రోజే గీజర్ పాడవడంతో ఎవరో స్నానానికి నీళ్లు బకెట్లో తెచ్చి ఇమ్మెర్షన్ రాడ్ తో వేడిచేసుకుంటున్నారు. నీళ్లు సలసల కాగుతున్నాయి. పడ్డ క్షణమే పిల్లి పిల్ల కిక్కురుమనకుండా ప్రాణం విడిచింది. ఊహించని పరిణామానికి ఆయన విలవిలలాడాడు.

మనస్తాపంతో కోర్టుకు వచ్చిన జడ్జి తన ముందున్న కేసుల్లో ఇద్దరిలా తాను కూడా దోషినేనే భావన రాగానే మరింత ఖిన్నుడయ్యాడు.

బోనులో నిలబడ్డ హోమ్ గార్డ్ చెప్పిందంతా విని ఓ నిమిషం అటు ఇటు చూసి జడ్జి –

'ఐ పి సి సెక్షన్ 428 . 429 ప్రకారం నీకు యాభై రూపాయలు జరిమానా. ఆఫీసులో కట్టేయి' అని తీర్పు చెప్పాడు. ఓ క్లర్క్ వెంట ఆయన వెళ్ళిపోయాడు.

బోనులో నిలబడగానే సురేష్ ' మిలర్డ్..నేను కూడా యాభై రూపాయలు కట్టేస్తాను' అన్నాడు ఉత్సాహంగా.

జడ్జి అడ్వొకేట్ వైపు చూశాడు. సైలెంట్ గా ఉండమన్నట్లు అడ్వకేట్ సురేష్ కు సైగచేశాడు.

' మీ ఇద్దరిది ఒకలాంటి కేసు కాదు. ఊరకుక్కని చంపితే శిక్ష అదే కానీ పెంపుడు జంతువుని చంపితే మూడేళ్ల నుంచి అయిదేళ్ల జైలు శిక్ష పడుతుంది' అన్నాడు జడ్జి.

సురేష్ కు అటు నుంచి అటే జైలు కెళతానేమోనని భయమేసింది.

' నా క్లయింట్ ఉద్దేశ్యపూర్వకంగా కుక్కను చంపలేదని ఊహించని రీతిలో ఆయనకు రోడ్ యాక్సిడెంట్ అయ్యింది' అని అడ్వొకేట్ సురేష్ చేతిలోని హాస్పిటల్ రిపోర్టులను జడ్జికి అందించాడు. ఆ కాగితాల్ని తిరగేసిన జడ్జికి ఈయన కూడా తనలాగే తెలిసి నేరం చేయలేదని అర్థమైంది. సురేష్ వైపు చూస్తూ 'ఇవ్వాళ్ల జులై ఏడు. ప్రపంచ క్షమాగుణదినం. తీర్పుల ద్వారా నష్టపోయిన జంతువులకు ఏదైనా మేలు జరగాలి. నీకు నీవే శిక్ష వేసుకుంటే దేనిని ఎంచుకుంటావ్ .' అన్నాడు.

వాతావరణం చల్లబడడంతో సురేష్ గొంతు సవరించుకున్నాడు.

'శిక్ష కోరుకునే అవకాశమిచ్చినందుకు మెనీ మెనీ థాంక్స్. నేను అనిమల్ ప్రొటెక్షన్ యాక్ట్ గురించి కొంత సెర్చ్ చేశాక కొన్ని సందేహాలు కలిగాయి. వాటిని మీరు తీర్చాలి మిలార్డ్. జంతువులను ఎవరు కొట్టవద్దని, చంపవద్దని చట్టం తెచ్చారు, బాగానే ఉంది. కానీ ఈ విషయం దేశంలో ఎందరికి తెలుసండి. అసలు పాటిస్తున్నవారెందరు..శిక్ష పడుతున్న వారెందరు.. ఓ సారి మా ఊరికి ఎలక్షన్ల భద్రత కోసం నాగాలాండ్ నుండి పోలీసులొచ్చారు. ఊర్లో కుక్కల్ని పట్టి తెచ్చినవారికి కొంత డబ్బులిచ్చారు. ఊర్లో, చుట్టుపక్కల దొరికిన కుక్కల్ని అప్పగించి కొందరు సొమ్ము చేసుకున్నారు. చివరకు చీకట్లో వాటిని కోసుకొని తినేవారని తెలిసి వాంతులు చేసుకున్నాం. వాకిట్లో ఆరబోసిన గింజల్ని తింటుందని మా అమ్మ పక్కింటివారి కోడిపై కట్టె విసిరింది. దాని కాలికి దెబ్బ తాకి అది ఒంటి కాలిపై నడిచేది. దాంతో కోడి ఓనర్ గొడవ చేస్తే దాని ధర ఇచ్చేసి కొనేసుకున్నాం. ఒంటి కాలుపై దాని బాధ చూడలేక ఓ రోజు కోసి వండేసుకున్నాం. ఇక్కడ గమనించేది ఏమిటంటే తినే జంతువులను హాయిగా తినేస్తున్నాం..తినని జంతువులను కొట్టినా చంపినా శిక్ష వేస్తున్నాం. దేశంలో కుక్కల్ని, పిల్లుల్ని కూడా తినేవారున్నారు. అది వారి ఆహారమని వదిలేయడమా.. పట్టుకొని శిక్షించడమా.. ఇదంతా చాల తికమకగా ఉంది మిలార్డ్ ' అన్నాడు సురేష్.

'స్వతంత్ర భారతంలో దొరికితే దొంగ.. చిక్కితే శిక్ష.. దాన్ని వదిలేయ్..నీ శిక్ష ప్రకటించుకో' అన్నాడు జడ్జి, సురేష్ మాటల్ని తేలిగ్గా తీసుకుంటూ.

జడ్జి మూడ్ బాగా లేదా లేక తన సందేహాలకు ఆయన దగ్గర కూడా జవాబు లేదా అర్థం కాలేదు సురేష్ కి.

ఇక బయట పడడమే మేలుకొని 'ఒక నెల సాలరీని బ్లూ క్రాస్ సొసైటీ కి డొనేట్ చేస్తాను మిలార్డ్.' అన్నాడు.

ఏమన్నావ్ అన్నట్లు కళ్లు ఎగరేశాడు జడ్జి.

'అదేనండి..హీరో నాగార్జున మిసెస్ అమల నడుపుతుంది. దానికి.. '

జడ్జికి చనిపోయిన పిల్లి గుర్తొచ్చింది.

తను తెలియక చేసిన మహా పతాకానికి నెల జీతం శిక్షను మనసులో తనకూ విధించుకున్నాడు.

జడ్జి మనసు శాంతించింది. కళ్లు మూసుకొని క్షమించమని పిల్లిని కోరుకున్నాడు.

మీకింకేం పని వెళ్లిపోండని గడియారం అయిదు గంటలు మోగించింది.

COMMENTS